ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.90 (311.7462)	68,210	61,965
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.85 (4.16)	1,352	483.3
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.89 (42.57)	31,834	33,295

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.176 | స్కిన్‌లెస్ : రూ.200



చకచకా స్థానిక ఏర్పాట్లు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం వేగం పెంచింది. గ్రామపంచాయతీలకు పాలక మండళ్ల పదవీకాలం ముగిసి ఏడు నెలలు దాటింది. ఈ నేపథ్యంలో ముందుగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. శుక్రవారం గ్రామపంచాయతీల వారీగా ఓటరు ముసాయిదా జాబితాను జిల్లా యంత్రాంగం విడుదల చేసింది. గ్రామ పంచాయతీలు, ఎంపీడీవో కార్యాలయాలు, కలెక్టరేట్‌లో జాబితాలను ప్రదర్శించారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)



- ఓటరు ముసాయిదా జాబితా విడుదల
- పంచాయతీ ఓటర్లు 5.20లక్షలు
- ఈ నెల 28న తుది జాబితా
- రాజకీయ పార్టీలతో సమావేశాలు



జిల్లాలోని మొత్తం 426 గ్రామ పంచాయతీల్లో 5,20,297 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,59,167మంది ఓటర్లు, మహిళలు 2,61,127మంది ఓటర్లు, ఇతరులు ముగ్గురున్నారు. ఓటరు ముసాయిదా జాబితాపై 14వ తేదీ నుంచి 21వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 26న అభ్యంతరాలను పరిష్కరించి, 28న తుది జాబితాను ప్రకటించనున్నారు. ఈ నెల 18న జిల్లాస్థాయిలో, 19న మండలస్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించే ఓటర్ల జాబితాల ప్రచురణలు ముగిసిన అనంతరం ప్రభుత్వం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల వివరాలు అందిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నీ కలుపుకుని 50శాతం రిజర్వేషన్లు మించరాదని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో బీసీలకు ఏ విధంగా రిజర్వేషన్లు అమలు చేయాలన్న అంశంపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. మరోవైపు బీసీ జనగణన కూడా పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అక్టోబరు, నవంబరులో గ్రామపంచాయతీ ఎన్నికలు రావొచ్చని రాజకీయనేతలు ఆశాభావంతో ఉన్నారు.

ఓటర్ల జాబితాలు సిద్ధం

ఓటర్ల జాబితాలు కూడా సిద్ధం చేసేందుకు జిల్లాయంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. తుది జాబితా పూర్తికాగానే ఓటరు జాబితాలను ప్రచురించనున్నారు. జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ ఉంటారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారుల నియామకం చేస్తారు. అయితే ముందస్తుగా అధికారుల నియామకాలపై పూర్తి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి నివేదిక రూపంలో అందించాల్సి ఉంటుంది. అనంతరం వారికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇస్తారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 1-200 మంది ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు మరో పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 మంది ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించాలి. ఒక్కో పంచాయతీలో వార్డుల వారీగా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించాలి. ప్రతీవార్డులో కనీసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి. ఒక వార్డులో 650 మంది ఓటర్లు ఉన్న చోట రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలి. ఈ మేరకు జిల్లాయంత్రాంగం చర్యలు చేపట్టనుంది.


మండలాల వారీగా ఓటర్లు ఇలా..

మండలం	పంచాయతీలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
అడ్డగూడూరు	17	11,168	11,484	0	22,652
ఆలేరు	16	10,259	10,701	1	20,961
ఆత్మకూరు	23	12,629	12,341	0	24,970
పోచంపల్లి	22	13,922	13,895	0	27,817
భువనగిరి	34	19,229	19,689	0	38,918
బీబీనగర్	34	20,813	21,112	0	41,925
బొమ్మలరామారం	35	14,354	14,536	1	28,891
చౌటుప్పల్	26	18,658	18,920	1	37,579
గుండాల	20	12,912	12,582	0	25,494
మోటకొండూరు	20	10,275	10,309	0	20,584
మోత్కూరు	10	6,354	6,495	0	12,849
నారాయణపూర్	31	19,765	19,569	0	39,334
రాజపేట	23	14,607	14,822	0	29,429
రామన్నపేట	24	22,401	22,216	0	44,617
తుర్కపల్లి	31	13,108	13,311	0	26,419
వలిగొండ	37	25,500	25,704	0	51,204
యాదగిరిగుట్ట	23	13,213	13,441		26,654
మొత్తం	426	2,59,167	2,61,127	3	5,20,297

ఓటర్ల జాబితా విడుదల: కలెక్టర్ హనుమంతు కే.జెండగే



భువనగిరి అర్బన్: గ్రామపంచాయతీల వారీగా ఓటర్ ముసాయిదా జాబితా విడుదల చేసినట్టు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈరోజు ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. జిల్లాలోని పంచాయతీలు, ఎంపీడీవో కార్యాలయాలు, కలెక్టరేట్‌లో జాబితాలు ప్రదర్శించినట్టు తెలిపారు. ఓటరు ముసాయిదా జాబితాపై ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించామన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాల సవరణపై 18న జిల్లా స్థాయిలో, 19న మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటుచేసి సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా 26న వాటిని పరిష్కరించి, 28న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు.



గెలుపొందిన డైరెక్టర్లతో అయిలయ్య

మదర్ డెయిరీ కాంగ్రెస్ చేతికి

నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (నార్మల్) ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ చేతిలో ఉన్న మదర్ డెయిరీ అత్యధిక డైరెక్టర్ల పదవులు గెలుచుకున్న కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లింది.

- నల్లగొండ, తుర్కపల్లి

- ఆరుగురు డైరెక్టర్ల గెలుపు
- నేడు డెయిరీ చైర్మన్ ఎన్నిక
- మధుసూధన్‌రెడ్డి ఏకగ్రీవం లాంఛనమే
- ఫలించిన మంత్రి కోమటిరెడ్డి వ్యూహం

హైదరాబాద్‌లోని హయాత్‌నగర్‌లో శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మదర్ డెయిరీ ఆరు డైరెక్టర్ల పదవులకు పోలింగ్ నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండజిల్లాలోని నాలుగు డైరెక్టర్ స్థానాలకు మొత్తం ఎనిమిది మంది పోటీపడగా, కాంగ్రెస్ తరఫున నలుగురు, బీఆర్ఎస్ నుంచి నలుగురు పోటీచేశారు. రంగారెడ్డి జిల్లాలో రెండు సీట్లకు నలుగురు పోటీచేశారు. మొత్తం 297 మంది పాలసొసైటీ చైర్మన్లు ఈ ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ అనంతరం జరిగిన ఓట్లలెక్కింపులో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మద్దతు తెలిపిన ఆలేరు నియోజకవర్గానికి చెందిన నలుగురు డైరెక్టర్లు, రంగారెడ్డి జిల్లాలో ఇద్దరు డైరెక్టర్లు గెలిచారు. ఎమ్మెల్యే అయిలయ్య ప్రతిపాదించిన డెయిరీ చైర్మన్ అభ్యర్థి గుడిపాటి మధుసూధన్‌రెడ్డికి 229 ఓట్లు పోల్ కాగా, కాంగ్రెస్ ప్యానల్‌కు చెందిన కల్లెపల్లి శ్రీశైలం 222 ఓట్లు, పుప్పాల నర్సింహులు 181, బత్తుల నరేందర్‌రెడ్డి 177, అగ్రాల నర్సింహారెడ్డి 242, మండలి జంగయ్యకు 232 ఓట్లు పోలవడంతోపాటు విజయం సాధించారు. బీఆర్ఎస్ ప్యానెల్ నుంచి ఒగ్గు భిక్షపతి, డి.సోమిరెడ్డి, ఎస్.భాస్కర్, ఎం.కొండల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా నుంచి పగడాల గణేశ్, ఎడ్ల రాంరెడ్డి పోటీచేశారు. మొత్తం 15మంది డైరెక్టర్లకు గతంలో 9మంది డైరెక్టర్లు పదవిలో ఉండగా ముగ్గురు మాత్రమే కాంగ్రెస్ ప్యానల్‌కు చెందిన వారు ఉన్నారు. ప్రస్తుతం ఆరుగురు గెలుపొందడంతో కాంగ్రెస్ బలం తొమ్మిదికి పెరిగింది. బీఆర్ఎస్ డైరెక్టర్లు ఆరుగురు ఉన్నారు. మెజార్టీ డైరెక్టర్లు కాంగ్రెస్‌కు ఉన్నందున చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. శనివారం హయాత్‌నగర్‌లోని డెయిరీ కార్యాలయంలో ఎన్నికల అధికారి సమక్షంలో గెలిచిన ఆరుగురు డైరెక్టర్ల పదవీకాలానికి డ్రా తీయనున్నారు.దీంట్లో ముగ్గురికి నాలుగేళ్లు,మరో ముగ్గురు ఐదేళ్లు పదవిలో కొనసాగుతారు.ఆతర్వాత చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు.

ఫలించిన మంత్రి కోమటిరెడ్డి వ్యూహం

మదర్ డెయిరీ ఎన్నికల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రచించిన వ్యూహం ఫలించింది. ఇప్పటి వరకు డెయిరీ పగ్గాలు అటు గుత్తా ఫ్యామిలీ, ఇటు గొంగిడి మహేందర్ రెడ్డి వర్గం చేతిలో కొనసాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గం డైరెక్టర్ పదవులు దక్కించుకొని డెయిరీలోకి అడుగుపెట్టినట్టయింది. ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ మూడు రోజుల పాటు క్యాంపు రాజకీయం నడిపింది. ఈ సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల సంఘాల చైర్మన్లతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడుతూ పర్యవేక్షించారు. దీంతోపాటు పోలింగ్ చివరి రోజున మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డికి ఎన్నికల బాధ్యతలు అప్పగించడంతో ఆయన వర్గానికి చెందిన 60 మంది ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. ఇది కాంగ్రెస్‌కు కలిసివచ్చింది.

నేడు చైర్మన్ ఎన్నిక

మదర్ డెయిరీ చైర్మన్ ఎన్నికను శనివారం ఉదయం 11గంటలకు కార్యాయంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కాంగ్రెస్ పెద్దల సూచన మేరకే ఆ పార్టీకి చెందిన 9మంది డైరెక్టర్లలో గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని ఏకగ్రీవంగా చైర్మన్‌ను ఎన్నుకోనున్నట్లు సమాచారం.

ఆలేరులో బీర్ల పైచేయి

మదర్ డెయిరీ ఎన్నికల్లో గెలుపుతో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆలేరు నియోజకవర్గంలో పైచేయి సాధించినట్టయింది. మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత భర్త, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి ప్యానల్ ఓడిపోవడం బీఆర్ఎస్‌కు గట్టిషాక్ తగిలినట్టయింది. పాలకవర్గంలో ఆరుగురు డైరెక్టర్లు బీఆర్ఎస్‌కు చెందిన వారు ఉండటం కొంత ఉపశమనం కలిగించింది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టేందుకు ఈ ఎన్నికల్లో పోటాపోటీగా ఖర్చు చేసినట్టు వినికిడి. ఓటర్లకు కాంగ్రెస్ రూ.45వేల నగదు, రూ.5వేల విలువైన వెండి వస్తువులు పంపిణీ చేసినట్టు ప్రచారంలో ఉంది. ఇక ఓటర్లకు బీఆర్ఎస్ రూ.15వేల వరకు పంపిణీ చేసినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా, పార్టీ అభ్యర్థులను గెలిపించినందుకు పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్లకు బీర్ల అయిలయ్య కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగం ప్రభుత్వరంగం కావాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



ఆలేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఆలేరు రూరల్, సెప్టెంబరు 13: విద్యారంగం పూర్తిగా ప్రభుత్వరంగం కాగలిగినప్పుడే మెరుగైన సామాజిక వికాసం జరుగుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుడు యోగేశ్వర్ రావు ఉద్యోగ విరమణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ విద్య అందరికీ అందుబాటులో ఉన్నప్పుడు పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువగలుగుతారన్నారు. భవిష్యత్ తరాలకు విలువలతో కూడిన విద్యను బోధించి వారు భవిష్యత్‌లో మంచి ఉద్యోగ అవకాశాలు పొందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వమే కొనసాగి ఉంటే ఇన్ని పదోన్నతులు ఉపాధ్యాయులకు వచ్చేవి కావని, కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినప్పుడు కొంత వింటుందన్నారు. రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా ప్రైవేటు రంగమైందని, ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు చదువును వ్యాపారంగా మార్చాయని ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, హెచ్‌ఎం దాసరి మంజుల, జంగయ్య, రవి, పోరెడ్డి రంగయ్య, భాస్కర్, మురళీ, హరినాథ్, పీఈటీలు మధు, జోసఫ్ పాల్గొన్నారు.

ఒక్కక్షణం ఆలోచించండి

ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు

బీబీనగర్, సెప్టెంబరు 13: ఆత్మహత్య చేసుకునే ముందు ఆ ఒక్క క్షణం ఆశావాహ దృక్పథంతో ఆలోచించాలని, ఆ ఆలోచనే బతకాలన్న ధైర్యాన్ని నింపుతుందని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. ఆత్మహత్యల నివారణపై శుక్రవారం బీబీనగర్ ఎయిమ్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ భాటియా మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఆత్మహత్యల నివారణ కోసం అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. ఈ ఏడాదిలోనే నాన్ హెల్త్ ప్రొఫెషనల్స్‌కు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ రాహుల్ నారంగ్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా పాల్గొన్నారు.



ఆత్మహత్యల నివారణపై ఎయిమ్స్‌లో జరిగిన అవగాహన సదస్సులో విజేతలకు బహుమతులు అందిస్తున్న డైరెక్టర్ వికాస్ భాటియా

రేపల్లె-సికింద్రాబాద్‌కు రామన్నపేటలో హాల్ట్

- నేటి నుంచి అమల్లోకి: దక్షిణమధ్యరైల్వే

•7లో..

నలుగురి ప్రాణాలు తీసిన అతివేగం

మోదీకి ప్రజలు మద్దతు పలకాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రుతి



పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న బంగారు శ్రుతి

వలిగొండ, సెప్టెంబరు 13: ప్రధాని మోదీకి ప్రజలు మద్దతు పలకాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి జిల్లా, సభ్యత్వ ప్రభరి చాడ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదును కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలను సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం చేయాలన్నారు. గతం కంటే అధిక సంఖ్యలో సభ్యత్వాలు సేకరించాలన్నారు. ప్రధాని మోదీ దేశంలో పలు సవాళ్లను ఎదుర్కొంటున్న, ఆయన ముందుకు సాగాలంటే ప్రజల సంపూర్ణ మద్దతు అవసరమన్నారు. అంతకుముందు బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, నాయకులు రాచకొండ కృష్ణ, దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, ఏలే చంద్రశేఖర్, సీఎస్‌రెడ్డి, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, వట్టిపల్లి శ్రీనివాస్, పడాల శ్రీనివాస్, చంద మహేందర్, ఊట్కూరి అశోక్‌గౌడ్, బోళ్ల సుదర్శన్, అమరేందర్, వెంకటేశం, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు భువనగిరికి బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్‌పాటిల్

భువనగిరి టౌన్: బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్యే అభయ్‌పాటిల్ శనివారం భువనగిరికి రానున్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదును ఆయన సమీక్షించనున్నారు. ఈ మేరకు స్థానికంగా ఉదయం 10.30గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల నుంచి ఎంపిక చేసిన నాయకులు ఈ సమావేశానికి హాజరుకానున్నట్టు తెలిపారు. ఇటీవలి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల అనంతరం, స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు చేపట్టిన సభ్యత్వ నమోదును పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశానికి ఆయన వస్తున్నట్టు తెలిపారు.

ఆరో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

● కేజీబీవీ సిబ్బంది వేధింపులే కారణమా? ● సూర్యాపేట జిల్లా మద్దిరాలలో ఘటన ● గోప్యంగా ఉంచిన సిబ్బంది



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీతిక

సూర్యాపేటక్రైం, మద్దిరాల, సెప్టెంబరు 13: సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) ఆరో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ బాలికను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా, ఈ విషయాన్ని పాఠశాల సిబ్బంది గోప్యంగా ఉంచారు. సేకరించిన వివరాలు, బంధువుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన గీతిక మద్దిరాలలోని కేజీబీవీలో ఆరో తరగతి చదువుతోంది. అక్కడి సిబ్బంది పలుమార్లు బాలికతో దురుసుగా మాట్లాడటంతో ఇదే విషయాన్ని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. కొద్ది రోజులుగా మనస్తాపంగా ఉంటున్న బాలిక శుక్రవారం ఉదయం పాఠశాల భవనం రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో గీతిక నడుం భాగానికి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ బాలికను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం రాత్రి సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో బాలికకు వైద్యం అందుతున్న తీరును జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఘటనపై పూర్తి విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వీరయ్య తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి : మాతృనాయక్



రోగులతో మాట్లాడుతున్న మాతృనాయక్

నాగార్జునసాగర్, సెప్టెంబరు 3: సీజనల్‌వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్‌వో డాక్టర్ మాతృనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో అన్ని వార్డుల్లో తిరిగి పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు విద్యార్థుల ఎంపిక

గట్టుప్పల్, సెప్టెంబరు 13: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మండలంలోని వెల్మకన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న శివసాయి విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సుభాష్ చందర్, పీడీ కొండ పరమేశం తెలిపారు. ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని ఉపాధ్యాయులు, గ్రామస్థులు కాంక్షించారు.

కట్టంగూరు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని చెరువు అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తీగల సాయివర్షణ్ విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందాల రమ, పీఈటీ చింతకాయల పుల్లయ్య తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు వరంగల్‌లోని జేఎన్ఎస్ స్టేడియంలో జరిగే 38వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో నల్లగొండ జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తికి చెందిన లెంకల జగత్ విఖ్యాత్‌రెడ్డి రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వట్టిమర్తికి చెందిన లెంకల ప్రవీణ్ రెడ్డి కుమారుడు జగత్ విఖ్యాత్‌రెడ్డి ఈ నెల 8న భువనగిరిలో జరిగిన నల్లగొండ జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని ప్రతిభతో ఒక బంగారు పతకం, రెండు కాంస్య పతకాలను సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు.

ప్రిన్సిపాల్‌కు ప్రశంసాపత్రం

చండూరు: చండూరు కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో 2023-24 సంవత్సరానికి 100శాతం ఉత్తీర్ణత సాధించినందుకు తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం నుంచి ప్రిన్సిపల్ మంజుల ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 కేజీబీవీ కళాశాలల్లో ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత ఫలితాలుండగా, అందులో చండూరు కేజీబీవీ జూనియర్ కళాశాల ఒకటిగా నిలిచింది.

ఉద్యోగ భద్రత కల్పించారు

● మిర్యాలగూడతో ఏచూరికి అనుబంధం


మిర్యాలగూడ సభలో నవ్వులు పూయిస్తూ.. ఏచూరి(ఫైల్)

మిర్యాలగూడ, సెప్టెంబరు 13: నల్లగొండ జిల్లా మిర్యాలగూడతో సీతారాం ఏచూరికి ప్రత్యేక అనుబంధం ఉంది. జాతీయ కార్యదర్శి హోదాలో అనేక సార్లు మిర్యాలగూడకు వచ్చారు. డిసెంబర్ 1, 2003లో పార్టీ డివిజన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. 2004 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకూ సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి గెలుపు కోరుతూ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. 2017లో టీమాస్ సభలకు హాజరయ్యారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా 2023 సెప్టెంబరు 17న ఎన్నెస్పీ క్యాంపు గ్రంథాలయం వద్ద జరిగిన బహిరంగసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మిర్యాలగూడ ఎఫ్‌సీఐ హమాలీ కార్మికుల కోసం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి.. సీతారాం ఏచూరితో కలిసి పలు మార్లు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించినట్లు కార్మిక సంఘం సీఐటీయూ నాయకులు గుర్తు చేసుకుంటున్నారు. ఆయా కార్యక్రమాలకు హాజరైన కార్యకర్తలు, ప్రజలను పలకరించిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు. ఆయనతో దిగిన ఫొటోలను తమ ఫోన్లలో స్టేటస్‌లుగా పెట్టుకుని ఆయనకు కన్నీటి నివాళి అర్పిస్తున్నారు.

కమీషన్ ఇస్తేనే కొటేషన్

● జీఎస్టీ వ్యాపారులకు కలిసివస్తున్న పీఎం విశ్వకర్మ పథకం ● లక్ష కొటేషన్ బిల్లుకు రూ.3వేలు కమీషన్



రామగిరి, సెప్టెంబరు 13: చేతివృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో 14 కులాలకు సంబంధించిన చేతివృత్తిదారులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, ఆధునిక పరికరాల కొనుగోలుకోసం రూ.లక్ష అందిస్తుంది. అంతేకాకుండా శిక్షణ కాలంలో వారం రోజులకు రూ.4వేలు కూడా ఇస్తుంది. ఇది కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పథకం. అయితే ఇంత వరకూ బాగానే ఉన్నా పీఎం విశ్వకర్మ పథకానికి జిల్లాలో వేలసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. వారికి నల్లగొండ, మిర్యాలగూడ వంటి ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత శిక్షణ సర్టిఫికేట్, ఆధార్, పాన్‌కార్డుల ఆధారంగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ బ్యాంకర్లు జీఎస్టీ కొటేషన్ బిల్లు ఉంటేనే రుణం మంజూరు చేస్తామని తేల్చి చెప్పడంతో శిక్షణ పొందిన దరఖాస్తుదారులు జీఎస్టీ వ్యాపారుల కోసం వెతకడం ప్రారంభించారు.

బిల్లుకు రూ.3వేలు కమీషన్ ఇవ్వాల్సిందే..

జీఎస్టీ కొటేషన్ బిల్లు కోసం కొంతమంది దరఖాస్తుదారులు నేరుగా జీఎస్టీ చెల్లిస్తున్న వ్యాపారులను ఆశ్రయిస్తుండగా, మరికొంత మంది దరఖాస్తుదారులు మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. అయితే వచ్చిందే అదునుగా భావించిన జీఎస్టీ చెల్లిస్తున్న వ్యాపారులు రూ.లక్ష బిల్ కొటేషన్ ఇవ్వడానికి రూ.3నుంచి రూ.5వేల వరకు కమీషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కొంతమంది వద్ద మొట్టమొదటే నగదు తీసుకొని బిల్లులు ఇస్తుండగా, మరికొంత మంది రుణం మంజూరు అయిన తర్వాతే కమీషన్ ఇవ్వొచ్చు అని ఆయా దరఖాస్తుదారులకు చెబుతున్నారు. జీఎస్టీ కొటేషన్ బిల్లు ఇచ్చిన వ్యాపారుల ఖాతాలోనే ఆ నగదు జమవుతుండటంతో దరఖాస్తుదారులకు రుణం మంజూరు అయిన తర్వాతే ఇవ్వొచ్చు అని చెబుతున్నారు. మొత్తంగా పీఎం విశ్వకర్మ పథకం, బ్యాంకర్లు పెట్టిన నిబంధనలు వీరికి కాసులు కురిపిస్తున్నాయి. ఈ విషయమై ఓ బ్యాంకు అధికారిని వివరణ కోరగా.. కొటేషన్ బిల్లు ప్రస్తుతానికి ఏమీ అవసరం లేదని చెప్పారు.

శిక్షణ కూడా అంతంత మాత్రమే

చేతివృత్తిదారులకు మరింత నైపుణ్యం పెంచేందుకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేశారు. కానీ కొన్ని శిక్షణ కేంద్రాల్లో వృత్తిపై ఏ మాత్రం అవగాహన లేని వారిని నియమించి వారితో నామమాత్ర శిక్షణ ఇప్పించడంపట్ల పలు విమర్శలు వెలువెత్తుతున్నాయి. వృత్తిపై శిక్షకులకే అవగాహన లేకుండా తమకు ఎలా శిక్షణ ఇస్తారని కొంతమంది దరఖాస్తుదారులు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని పలువురు దరఖాస్తుదారులు ఆరోపణలు చేస్తున్నారు.

పత్తిపంట ఎర్రబారుతోంది

● ఇటీవలి వర్షాలతో మునిగిన పత్తిచేలు ● జాలువారుతున్న మొక్కలు ● పెరుగుతున్న కూలీల ఖర్చులు ● ఆందోళనలో రైతులు



సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 13: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిపంట ఎర్రబారుతోంది. ఇప్పటికే పత్తిచేలు ఆరకపోవడంతో జాలువారుతున్నాయి. ఆకులకు తెగుళ్ల సోకి ఎర్రరంగుగా మారుతున్నాయి. ముఖ్యంగా పంట చేలో వర్షం నీరు నిలిచి తడి ఆరకపోవడంతో మొక్కలు వాడిపోయేలా మారాయి. జిల్లాలో పత్తిపంట 89,230 ఎకరాల్లో సాగవుతోంది. జిల్లాలో ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేపడుతుండడంతో పత్తిసాగు ప్రతీ సంవత్సరం పెరుగుతూ వస్తోంది. సీజన్ ప్రారంభంలోనే పత్తిసాగు చేయగా ఎండల తీవ్రతతో కొంత నష్టంజరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి పంటకు మరింతగా నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా మొక్కలు ఎదిగే దశలో వర్షం పడి వరదనీరు చేలో నిలవడంతో మొక్కలు ఎదగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు మొక్క ఎదుగుదలలేక దిగుబడి రాదని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

2.83లక్షల ఎకరాల్లో సాగు

ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మొత్తం వానాకాలంలో 2,83,757 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో వరి 1,97,669 ఎకరాలు, పత్తి 77,794 ఎకరాల్లో, కంది 1,410 ఎకరాల్లో, మిర్చి 4,073 ఎకరాల్లో, పెసర 2,403 ఎకరాల్లో, వేరుశనగ 251 ఎకరాల్లో, ఇతర పంటలు 157 ఎకరాల్లో సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మొత్తం 30,000 ఎకరాల్లో నష్టం జరిగింది. వరి 23 వేల ఎకరాల్లో, పత్తి 6000 ఎకరాల్లో, పెసర 300 ఎకరాల్లో పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా మిరప 300 ఎకరాల్లో, మామిడి 60 ఎకరాల్లో కందిపంట 38 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో పంటలకు అధిక నష్టం జరిగింది. నడిగూడెం మండలంలో సాగర్ ఎడమ కాల్వకు గండిపడడంతో వరద నీరు పంటలను ముంచేసింది. అంతేకాకుండా ఇసుక మేటలు పొలాల్లో చేరి మరో సీజన్ వరకు తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవు.

కలుపు తీసే అవకాశం లేకుండా పోయింది

పత్తి చేను సాగు చేసిన 10 రోజుల నుంచి పత్తి చేను మధ్యలో ఎలాంటి కలుపుపెరగకుండా దుక్కిని చదును చేస్తుంటారు. అంతేకాకుండా కూలీలతో కలుపు, ఇతర పిచ్చి మొక్కలను తొలగిస్తుంటారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో పంట చేలో ఎలాంటి పనులు చేయకుండా అవుతోంది. కనీసం ఒకటికి రెండు సార్లు మందులు పిచికారీ చేయాల్సి ఉండగా, ఆ దిశగా రైతులు చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. దీంతో కలుపు పెరిగిపోతుంది. అంతేకాకుండా పత్తిచేలో వర్షం నీరు ఉండడంతో ఆకురంగు పసుపురంగులోకి మారుతోంది. అదేవిధంగా మొక్క వేళ్ల సైతం కుళ్లిపోయే ప్రమాదం ఉంది. మొక్కను బలంలేక దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే కలుపును మొదటి నుంచి తొలగించుకుంటూ పోతే అంతగా ఖర్చు రాకుండా తగ్గుతుంది. కానీ కురుస్తున్న వర్షాలతో కలుపు సైతం అధికంగా పెరగడంతో కూలీలు పెంచాల్సి వస్తుంది. దీంతో ఖర్చులు పెరుగుతాయని రైతులు పేర్కొంటున్నారు.

పత్తిపంటకు నష్టం వాటిల్లింది



ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిపంట నీట మునిగింది. ఆకులు ఎర్రగా మారాయి. కలుపు సైతం విపరీతంగా పెరిగింది. కూలీల ఖర్చు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఎకరానికి రూ.15వేలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

సోమిరెడ్డి లింగారెడ్డి, ఆత్మకూర్(ఎస్)

పంట నష్టం అంచనా వేస్తున్నాం

వర్షంతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేస్తున్నాం. పంటలో జాలు పట్టింది. నీటిని తొలగించేలా రైతులు ప్రయత్నించాలి. 33శాతం పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించే అవకాశం ఉంది. పత్తి, మిర్చి, పెసర పంటలకు అధికంగా నష్టం వాటిల్లింది.

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్‌సేవ


ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 13: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలతో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.12,48,294 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవోఏ. భాస్కర్‌రావు తెలిపారు.

వందేభారత్‌కు మిర్యాలగూడ హాల్ట్ కొనసాగింపు

● నేటి నుంచి అమల్లోకి: దక్షిణమధ్యరైల్వే

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-తిరుపతి మార్గంలో నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు మిర్యాలగూడలో హాల్ట్‌ను కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే ప్రకటించింది. గతంలో ఇచ్చిన తాత్కాలిక హాల్ట్ ఉత్తర్వులు శుక్రవారంతో ముగియగా, తాజాగా జారీచేసిన కొనసాగింపు ఉత్తర్వులు శనివారం నుంచి అమలవుతాయని సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. అలాగే, సికింద్రాబాద్-రేపల్లె ఎక్స్‌ప్రెస్‌కు సిరిపురంలో, రేపల్లె-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌కు రామన్నపేటలో గతంలో ఇచ్చిన హాల్ట్ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

బుద్ధవనం ఓ వారసత్వ ప్రదర్శనశాల

● శ్రీరామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి దాజీ కమలేష్ పటేల్


బౌద్ధ శిల్పాలను పరిశీలిస్తున్న కమలేష్ పటేల్

నాగార్జున సాగర్, సెప్టెంబరు 13: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం ఓ బౌద్ధ వారసత్వ ప్రదర్శనశాల అని శ్రీరామ చంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి దాజీ కమలేష్ పటేల్ అన్నారు. ప్రపంచ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన సాగర్ ఫైలాన్‌కాలనీలో శ్రీరామచంద్ర మిషన్‌ను సందర్శించారు. హార్ట్‌ఫుల్‌నెస్ సభ్యులనుద్దేశించి మాట్లాడిన అనంతరం బుద్ధవనం ప్రత్యేకాధికారి, పర్యాటక శాఖ ఎండీ ఎన్.ప్రకాష్‌రెడ్డి ఆహ్వానం మేరకు సాయంత్రం బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బుద్ధవనంలో మహాస్థూపం, స్థూపవనం, జాతక వనం, చరిత వనాలను తిలకించారు. మహాస్థూపం లోపల ఉన్న బుద్ధుడి ధాతువును చూశారు. శ్రీలంకదేశం బహూకరించిన 27 అడుగుల అవకన బుద్ధ విగ్రహాన్ని పరిశీలించారు. బుద్ధవనంలో ఉన్న మహాస్థూపంపై బౌద్ధ శిల్పాలను గురించి బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా దాజీ కమలేష్ పటేల్ మాట్లాడుతూ 1700 సంవత్సరాల నాటి బౌద్ధ చరిత్ర, వారసత్వాన్ని నేటి తరానికి వివరించేందుకు కళ్లకు కట్టినట్లు బుద్ధవనంలో నిర్మించారన్నారు. బౌద్ధ వారసత్వ విలువలను ఈతరానికి అందిచాలనే ఉద్దేశంతో బుద్ధవనాన్ని నిర్మించడం గొప్ప విషయమన్నారు. ఆయనవెంట ఎండీ ప్రకాష్‌రెడ్డి, జెన్కో సీఎండీ రోనాల్డ్ రాస్, ఆరోగ్యశ్రీ సీఈవో డాక్టర్ విసాలాక్షి, సేద్యపునీటి వనరుల మాజీ చైర్మన్ ప్రకాష్, బయోజన్ కేర్ డైరెక్టర్ పార్థసారధి, బుద్ధవనం ఓఎస్డీ సూధన్‌రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, బుద్ధవనం శిల్పి శ్యాంసుందర్ ఉన్నారు.

వరంగల్ రీజియన్‌కు రూ.705 కోట్ల ఆదాయం

● రీజినల్ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 13: మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ పరిధిలోని 110 ఏఎంసీల ద్వారా రూ.705 కోట్ల ఆదాయం వచ్చిందని రీజనల్ జాయింట్ డైరెక్టర్ వి. శ్రీనివాస్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. వరంగల్ రీజియన్ పరిధిలో 14 రైతు బజారులున్నాయని తెలిపారు. గత సంవత్సరం నిర్దేశించిన వార్షికాదాయం రూ.438కోట్లను అధిగమించామని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో వార్షిక ఆదాయ లక్ష్యం రూ.448 కోట్లుగా నిర్ణయించామని తెలిపారు. ఈ లక్ష్యాన్ని అధిగమిస్తామన్న నమ్మకం తమకు ఉందన్నారు. వరంగల్ రీజియన్ పరిధిలో ఉమ్మడి నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలు వస్తాయని, కొత్త వాటిని పరిగణలోకి తీసుకుంటే 17జిల్లాలు ఉంటాయన్నారు. 1046 మంది సిబ్బందికి కేవలం 351 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. వచ్చే నెల నుంచి ప్రారంభంకానున్న పత్తి కొనుగోళ్లకు సంబంధించి రీజియన్‌లో 233 జిన్నింగ్ మిల్లులుండగా, అందులో ఇప్పటివరకు 205 మిల్లులను పరిశీలించి, గుర్తించామని తెలిపారు.

చౌటుప్పల్ ఏఎంసీ ఆదాయానికి అద్దెలు దోహదం

చౌటుప్పల్ వ్యవసాయమార్కెట్ కమిటీ ఆదాయాన్ని పెంచుకునేందుకు వ్యాపార మడిగెల అద్దెలు దోహదం చేస్తాయని శ్రీనివాస్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఏఎంసీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 13 మడిగెల అద్దె ఖరారు కోసం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంపాటలో 13 మడిగెలకు నెలకు రూ.1,46,100 అద్దె ఖరారైనట్లు చెప్పారు. మడిగెలను పొందిన వ్యాపారులు ఐదు రోజుల్లో ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఏఎంసీ పర్సన్ ఇన్‌చార్జి పద్మావతి, డీఎంవో సబిత, డీఈ అశోక్, ఏఎంసీ సెక్రటరీ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.5కోట్ల విరాళం


సీఎం రేవంత్‌రెడ్డికి విరాళం చెక్కును అందజేస్తున్న వి.నారాయణ

నల్లగొండ, సెప్టెంబరు 13: వరద బాధితులను ఆదుకునేందుకు రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.నారాయణ రూ.5కోట్ల చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సచివాలయంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ సహాయ కార్యక్రమాల కోసం ఔదార్యం చాటుకున్న రెడ్డీస్ ల్యాబ్‌ను అభినందించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి ఉన్నారు.

ఈ ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనం నిషేధం

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 13: నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పుట్టంగండిలో గణేష్ నిమజ్జనాలను నిషేధించినట్లు కొండమల్లేపల్లి సీఐ ధనంజయ్‌గౌడ్, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపారు. శుక్రవారం అజ్మాపురం పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పుట్టంగండిలోని నీటిని హైదరాబాద్ జంటనగరాలకు, మిషన్ భగీరథకు తాగునీటికి వాడుతున్నందున నీటి కలుషితం కాకుండా ఆయా ప్రాంతాల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు ఘనపురం బ్రిడ్జి వద్ద, అజ్మాపురం పుష్కర ఘాట్ వద్ద భారీ క్రేన్‌లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సాగర్ కొత్త వంతెన వద్ద కూడా..

నాగార్జునసాగర్: సాగర్ ఫైలాన్ కాలనీలో కొత్త వంతెన వద్ద భద్రతా కారణాల దృష్ట్యా వినాయక విగ్రహాల నిమజ్జనం నిషేధించినట్లు సాగర్ ఎస్ఐ సంపత్ తెలిపారు. నిమజ్జనాలు హిల్‌కాలనీ సమీపంలో దయ్యాలగండి వద్ద సమ్మక్క-సారక్క పుష్కర ఘాట్ వద్ద మాత్రమే చేయాలని సూచించారు.

అంతర్రాష్ట్ర ద్విచక్రవాహన దొంగ అరెస్ట్

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 13: అంతర్రాష్ట్ర బైక్ దొంగను కొండమల్లేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి శుక్రవారం తెలిపారు. ఈ నెల 3,4 తేదీల్లో కొండమల్లేపల్లి పట్టణంలోని ఇళ్ల ఎదుట పార్కింగ్ చేసిన రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించారు. శుక్రవారం పెండ్లిపాకల ఎక్స్ రోడ్డు వద్ద చోరీలకు పాల్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల ప్రాంతానికి చెందిన కోట చిన్నరాజును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

కోళ్లఫాం నుంచి దుర్వాసన రాకుండా చర్యలు

దేవరకొండ, సెప్టెంబరు 13: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ ఆదర్శ పాఠశాల సమీపంలో కోళ్లఫాంనుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు, డీఎస్పీ గిరిబాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో నీలిమ తెలిపారు. శుక్రవారం వారు పాఠశాలను పరిశీలించారు. కోళ్లఫాం వాసన భరించలేకపోతున్నామని విద్యార్థులు ఈ నెల 12న ప్రార్థన అనంతరం ఇళ్లకు వెళ్లిపోగా, విద్యార్థి సంఘాలు ధర్నా నిర్వహించాయి. విషయం తెలుసుకున్న ఆర్డీవో, డీఎస్పీ శుక్రవారం పాఠశాలకు చేరుకొని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోళ్లఫారం నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కోళ్ల ఫాంను తొలగించాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు ఆర్డీవో శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు.

నలుగురి ప్రాణాలు తీసిన అతివేగం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శుక్రవారం అతివేగం కారణంగా నాలుగు ప్రాణాలు గాల్లో కలిశాయి. పీఏపల్లి మండలంలో ఇద్దరు, పెద్దవూర, కనగల్‌లో ఇద్దరు దుర్మరణం చెందగా.. శాలిగౌరారంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మరొకరు మృతి చెందారు.


కనగల్ మండలంలో ప్రమాదంలో దెబ్బతిన్న ట్రాక్టర్, ఘటనాస్థలిలో క్షతగాత్రుడు, పెద్దవూర, పీఏపల్లిలో మృత్యువాతపడిన వెంకటేశ్వర్లు, ధనయ్య(ఫైల్)


పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 13: ఆర్టీసీ బస్సు, బైక్‌కు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలోని చిలకమర్రి స్టేజీ సమీపంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. గుడిపల్లి ఎస్ఐ డి.నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బొరుగు ధనయ్య(59), దేవరోనితండకు చెందిన ఇస్లావత్ తారు(55) కొండమల్లేపల్లి సమీపంలోని సాయిలక్ష్మి రైస్‌మిల్లులో గుమస్తా, దినసరి కూలీగా పనిచేస్తున్నారు. శుక్రవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని చిలకమర్రి స్టేజీ సమీపంలోని గోదాంకు ధాన్యం బస్తాల లోడ్ పని మీద వచ్చారు. పని ముగిసిన తర్వాత ఇంటికి వెళ్తుండగా చిలకమర్రి స్టేజీ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద యూటర్న్ అయ్యే క్రమంలో వెనుక నుంచి వస్తున్న దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇస్లావత్ తారు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన ధనయ్యను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందారు. ఇద్దరి మృతదేహాలను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్ఐ తెలిపారు.

పెద్దవూర: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని బెట్టలతండా సమీపంలో గల సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పెద్దవూర ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లికల్ గ్రామానికి చెందిన చెన్నబోయిన వెంకటేశ్వర్లు (35) తన భార్య ప్రేమలతతో కలిసి ఆస్పత్రి పని మీద నెల్లికల్ నుంచి వారి అత్తగారి ఊరైన తుమ్మచెట్టు ఎక్స్‌రోడ్డు వద్దకు బయలుదేరారు. తుమ్మచెట్టు వైపు వస్తుండగా విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న మహేంద్ర జీపు డ్రైవర్ కొప్పుల కార్తీక్ అతివేగంగా వాహనాన్ని నడుపుతూ వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వెంకటేశ్వర్లు, అతని భార్య ప్రేమలతకు తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్సకోసం హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తుండగా వెంకటేశ్వర్లు మృతిచెందారు. అతని భార్య ప్రేమలత పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వెంకటేశ్వర్లు పెద్దవూర మండలం పర్వేదులలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటేశ్వర్లు తమ్ముడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ..

కనగల్: లారీడ్రైవర్ అజాగ్రత్త.. అతివేగం ఓ ప్రాణాన్ని బలిగొనగా.... మరొకరి పరిస్థితి విషమంగా మారింది. నల్లగొండ జిల్లా కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం కుమ్మరికుంట కాల్వ గ్రామానికి చెందిన గోగు లింగమ్మ(69) ఉదయం వడ్లు పట్టించుకునేందుకు గ్రామానికి చెందిన డ్రైవర్ కన్నెబోయిన కొండల్‌ను కిరాయికి మాట్లాడుకుని ట్రాక్టర్‌లో ఎస్.లింగోటం స్టేజీ వద్ద గల రైస్‌మిల్లుకు వచ్చారు. ధాన్యం పట్టించిన తర్వాత బియ్యం బస్తాలను ట్రాక్టర్‌లో వేసుకుని తిరిగి గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో మండలంలోని బాబాసాయిగూడెం స్టేజీ వద్ద నల్లగొండ-హాలియా ప్రధాన రహదారిపై నల్లగొండ నుంచి హాలియా వైపు అతివేగంగా వస్తున్న లారీ వీరి ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీ ధ్వంసం కాగా, అందులో కూర్చున్న లింగమ్మకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాక్టర్ డ్రైవర్ కొండల్ తలకు గాయాలు కావడంతో, పరిస్థితి విషమించగా చికిత్స కోసం నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు గోగు వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం లింగమ్మ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో..



శాలిగౌరారం: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఒకరు మృతి చెందారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్ర భిక్షం(44) బుధవారం ఉదయం పొలం పనులకు వెళ్లి వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు 108లో సూర్యాపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాలు, చెయ్యి పడిపోయిందని వెంటనే హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు చేయగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని వైద్యులు నిర్ధారించారని, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. భిక్షంకు భార్యతోపాటు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.

దోమల మోత..దుర్వాసన



భువనగిరిలో బాలికల వసతి గృహం ముందు మురికి కుంట

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహ ప్రాంగణం సమీపంలో మురికి కుంట తయారయ్యింది. గత ఆరు నెలలుగా పాలకులు, సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే కరువయ్యారని విద్యార్థులు వాపోతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు జ్వరం, దగ్గు, చర్మ వ్యాధులతో వ్యాప్తి చెందుతుండగా విద్యార్థినులు సతమతమవుతున్నారు. మురికి నిల్వ ఉండటంతో దోమలు, దుర్వాసనతో వసతి గృహంలోని విద్యార్థినులతో పాటు చుట్టు ప్రక్కల నివాసం ఉన్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి మురికి నీరు రోడ్డుపైకి ప్రవహిస్తుండగా వాహనచోదకులు, పాదచారులు నానా అగచాట్లు పడుతున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

-స్టాఫ్‌ఫొటోగ్రాఫర్-యాదాద్రి

ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు లోటు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ అన్నారు. శుక్రవారం భువనగిరిలో సీతారాం ఏచూరి సంతాప సభలో ఆమె మాట్లాడారు. ఏచూరి ఆశయాల సాధనకు పార్టీ కార్యకర్తలందరూ కృషి చేయాలన్నారు. ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయ



చౌటుప్పల్‌లో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కులు గద్దె నరసింహ, మాయ కృష్ణ, బందెల ఎల్లయ్య, వల్లాస్ అంజయ్య, కల్లూరి నాగమణి, కొత్త లలిత, రాంబాబు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : సీతారాం ఏచూరి మరణంతో దేశం ఒక గొప్ప ప్రజా ఉద్యమకారుడిని కోల్పోయిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి. పాషా అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్ లో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బడారు నర్సింహ, సహాయ కార్యదర్శి దండ అరుణ్ కుమార్, నాయకులు గోశిక స్వామి, ఆకుల ధర్మయ్య, చీకూరి ఈదయ్య, బత్తుల దాసు, పర్నే ధర్మారెడ్డి, ఎర్ర ఊశయ్య, కలకుంట్ల శివకుమార్, టి.మల్లేశ్, గుర్రం నర్సింహ, రామచంద్రం, ఎన్.నర్సింహ, ఎం.రాములు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : సీతారాం ఏచూరి మరణం దేశ కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని ఆపార్టీ మండల కార్యదర్శి వేముల బిక్షం అన్నారు. సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు, కూరెళ్ల, పల్లెర్ల గ్రామాల్లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. నాయకులు ఆర్.గోవర్ధన్, ఆర్.సత్తయ్య, సీహెచ్.మల్లేశం, టి.సత్యనారాయణరెడ్డి, దారాపు మల్లేశం, టి.యాదయ్య, జి.స్వామి, గోపాల్‌రెడ్డి, రాములు, బీరయ్య పాల్గొన్నారు.

గుండాల : మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు, మండల కమిటీ సభ్యులు పోతరబోయిన సత్యనారాయణ, నాయకులు ఎండీ.ఖలీల్, బాలయ్య పాల్గొన్నారు.

అడ్డగూడూరు: అడ్డగూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్రు అనిల్ కూమార్, నాయకులు వళ్లంభట్ల శ్రీనివాసరావు, గూడేపు ఎల్లయ్య, బండి సోమయ్య ఉన్నారు.

భువనగిరి అర్బన్: యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు బబ్బూరి పోశెట్టి, నూకల భాస్కర్‌రెడ్డి, ఎస్కే లతీఫ్, ఎస్కే.షరీఫ్, ఈశ్వర్‌రెడ్డి, మల్లయ్య, పీఎస్.లింగం పాల్గొన్నారు.



భువనగిరిలో సీతారాం ఏచూరికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్‌పోచంపల్లి : విప్లవ వీరుడు, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయాన్ని ప్రజా శ్రేయస్సుకు అంకితం ఇవ్వడం గర్వకారణం అని భూదాన్‌పోచంపల్లి మండల సీపీఎం సీనియర్ నాయకుడు గూడూరు అంజిరెడ్డి అన్నారు. సీతారాం ఏచూరి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ శుక్రవారం పట్టణంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నాయకులు కోట రామచంద్రారెడ్డి, బాల నర్సింహ, మంచాల మధు, బుచ్చిరెడ్డి, జ్యోతి, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, లక్ష్మయ్య, జగన్, మల్లారెడ్డి, జంగారెడ్డి, అశోక్, భిక్షపతి, వడ్డేపల్లి యాదగిరి, వీరారెడ్డి, మల్లేష్, యుద్దంరెడ్డి, గుర్రు భిక్షపతి పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం)లో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



యాదగిరిగుట్టలో ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పోచంపల్లిలో ఏచూరి ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకుడు అంజిరెడ్డి

పట్టాలు పొందినవారు ఇళ్లు నిర్మించుకోవాలి



ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తను తొలగింపజేస్తున్న మునిసిపల్ సిబ్బంది

మోత్కూరు, సెప్టెంబరు 13: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన వారు వెంటనే మునిసిపాలిటీ నుంచి అనుమతి తీసుకుని ఇళ్లు నిర్మించుకోవాలని మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమకు ఇంటి స్థలం ఇస్తే ఇళ్లు నిర్మించుకుంటామని ప్రభుత్వం నుంచి ప్లాటు తీసుకుని, ఇళ్లు నిర్మించకుండా వదిలేయడంతో ఇళ్ల మధ్యన చెత్తాచెదారం పేరుకపోయి దోమలు వ్యాప్తి చెంది కాలనీ వాసులు రోగాల భారిన పడుతున్నారన్నారు. విషపురుగులు సంచరిస్తున్నాయన్నారు. కాలనీలో సీసీరోడ్లు, మురుగు కాల్వలు కూడా నిర్మిస్తున్నామన్నారు. అందులో ప్లాట్లు ఉన్న వారు నెల రోజుల్లో మునిసిపాలిటీ నుంచి అనుమతి తీసుకుని ఇళ్లు నిర్మించుకోనట్టయితే వారి పట్టాలు రద్దు చేసి, ఇల్లు లేని పేదలకు కేటాయించేలా కౌన్సిల్‌లో తీర్మానం చేస్తామని హెచ్చరించారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 13: గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని చౌటుప్పల్ గౌడ సంఘం అధ్యక్షుడు చింతకింది అంజయ్య తెలిపారు. చింతకింది అంజయ్య తన తల్లి దండ్రుల జ్ఞాపకార్థం రూ. 10 లక్షల అంచనాతో స్థానిక గౌడ సంఘం భవనంలో నిర్మించనున్న అదనపు భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, గౌడ సంఘం నాయకులు బొడిగె బాలకృష్ణ, బత్తుల లక్ష్మయ్య పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తిసాగు రైతులకు లాభదాయకం

మోత్కూరు, సెప్టెంబరు 13: అధిక సాంద్రత పత్తి సాగు రైతులకు ఖర్చు తగ్గి లాభదాయకంగా ఉంటుందని ఏరువాక శాస్త్రవేత్తలు బి.అనిల్‌కుమార్, కె.మమత అన్నారు. స్పెషల్ ప్రాజెక్టు ఆన్ కాటన్ పథకంలో మోత్కూరులో ఎం.బ్రహ్మాచారి, బుజిలాపురంలో సిహెచ్.వెంకన్న సాగు చేసిన అధిక సాంద్రత పత్తి చేనును శుక్రవారం వారు పరిశీలించారు. ఏరువాక కేంద్రం, రాశి కంపెనీ, దాన్ ఫౌండేషన్ సహకారంతో న్యూమాటిక్ ప్లాంటర్ ద్వారా విత్తినందున పత్తి చేను ఎలా ఉందని, రైతుల అనుభవాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

దివీస్ సేవలు అభినందనీయం

వలిగొండ, సెప్టెంబరు 13: విద్యాభివృద్ధికి దివీస్ సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్నేపల్లి-నెమలిక్వాల పంచాయతీ కార్యదర్శులు అను, శ్రీను శుక్రవారం మండలంలోని బొల్లేపల్లి-నెమిలకాల్వ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివీస్ లేబొరేటరిస్ లిమిటెడ్ సౌజన్యంతో రూ.2,19,842 విలువ గల నోట్ బుక్స్‌ను స్కూల్ బ్యాగ్స్‌ను, వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ, నాగరాజు, దివీస్ ప్రతినిధులు సాయికృష్ణ, వెంటకేశ్వర్లు ఉన్నారు.

మన యాసలోనే మన బతుకు

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 13: మన యాసలోనే మన బతుకు ఉన్నదని, మన భాషలోనే మన సంస్కృతి ఉన్నదని మన తెలంగాణ భాషను, యాసను రక్షించుకోవాలని జూలూరు జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ బాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ కాళోజీ సమాజ గొడవను తన గొడవగా భావించి 'నా గొడవ' అనే పేరుతో కవిత్వాన్ని రాసి ప్రజా కవిగా గుర్తింపు పొందారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, పద్య పఠనం, కథాకథనంలో పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. తెలుగు ఉపాధ్యాయులు కె.మనోహర్, బి.వీరాచారి, ఉపాధ్యాయులు సునీత, సహజీవన్, వెంకన్న పాల్గొన్నారు.

కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: పీడీ

భువనగిరి రూరల్, సెప్టెంబరు 13: అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ పీడీ కేవీ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం భువనగిరి మండలం అనంతారం, రాయిగిరి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పిల్లలకు ఆటపాటలు, సెలబస్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యతో విజ్ఞానం, ఉద్యోగం: సామేల్

మోత్కూరు, సెప్టెంబరు 13: ప్రతీ ఒక్కరు చదువుకోవాలని, విద్య కేవలం ఉద్యోగం చేయడానికే కాదని, విద్యతో విజ్ఞానం వస్తుందని, సంస్కారం అబ్బుతుందని, తద్వారా సమాజం సంస్కరించబడుతుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథ మ సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన స్వాగతోత్సవం (ఫ్రెషర్స్ డే)లో ఆయన మాట్లాడారు. కేరళలో 100శాతం అక్షరాస్యత ఉన్నందునే ఆ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుందని, వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. క్రాస్ సంస్థ ఈ ప్రాంతంలో ఎంతో మందికి అక్షరజ్ఞానం కల్గించిందన్నారు. తాను తొలుత క్రాస్ సంస్థలో ఒక్క రూపాయి వేతనానికి కోఆర్డినేటర్‌గా పని చేశానన్నారు. ఈ ప్రాంతంలో తాను తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేశానని, తనను ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ఈ ప్రాంత అవసరాలు తీర్చి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. మోత్కూరుకు కళాశాల హాస్టల్ కావాలంటే ఒక్క గంటలో మంజూరు చేయించానని, ఇక్కడ ఇంటర్ చేసిన విద్యార్థులు ఉన్నత చదువుకు బయటకు వెళ్లకుండా మోత్కూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానన్నారు. మోత్కూరులో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయిస్తానన్నారు. కాగా విద్యార్థులు తరగతులకు హాజరు కాకయినా, కళాశాలకు రాకపోయినా వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందిస్తున్నామని, తమ కళాశాలను మొబైల్ ఫోన్ రహిత కళాశాలగా తీర్చిదిద్దామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభజస్టీస్ చెప్పగా ఆమెను ఎమ్మెల్యే సామేల్ అభినందించారు. అంతకు ముందు కళాశాల ఆవరణలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో అమృత్ 2.0 పథకంలో రూ.2.25 కోట్లతో నిర్మించనున్న 800కేఎల్ ఈఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంకు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మోత్కూరు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రానికి యూత్ కాంగ్రెస్ నాయకుడు మెంట రాజు ఇచ్చిన కుర్చీలు, పలకలు, ప్లేట్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్ పర్సన్ గుర్రం కవిత, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభజస్టీస్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సత్యనారాయణ, ఏఈ సురేష్, మునిసిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, లెక్చరర్లు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

అంచెలవారీగా సమస్యల పరిష్కారం



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, సెప్టెంబరు 13: మండలంలో ఉన్న పలు సమస్యలను అంచెల వారీగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని కక్కిరేణి గ్రామంలో సీవీడీసీ, టీబీవోసీడబ్ల్యూడబ్ల్యూబీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసి, ఇస్కిల్లలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రామన్నపేట రైతు వేదికలో 99 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో మండలాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. స్వయం ఉపాధి పొందడానికి మహిళలు కుట్టు శిక్షణ పొందడం అభినందనీయమని, నిరుద్యోగ యువకులు కూడా స్వయం ఉపాధికోసం వివిధ రంగాల్లో శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాల్‌బహద్దూర్, ఎంపీడీవో భూక్యా యాకూబ్‌నాయక్, బెస్ట్ సేవా సొసైటీ అధ్యక్షుడు భూక్యా ఈశ్వరయ్య, పార్టీ నాయకులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, గంగుల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, జెల్ల వెంకటేశం, గుత్త నర్సిరెడ్డి, తిమ్మాపురం మహేష్‌రెడ్డి, రామిని రమేష్, వనం చంద్రశేఖర్, ఎండీ.అక్రమ్, జమీరొద్దీన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ మధ్య తలెత్తిన వివాదంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు అరికపూడి గాంధీ ఇంటి ముట్టడికి వెళ్తుండగా ముందస్తుగా శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. శాంతి భద్రతల నేపథ్యంతో మాజీ జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, భువనగిరి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జనగాం పాండు, మాజీ ఎంపీటీసీ అబ్బగాని వెంకట్ గౌడ్, నీల ఓం ప్రకాశ్, చిందం మల్లికార్జున్‌లను అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచికతపై విడుదల చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ వి సంతోష్‌కుమార్ తెలిపారు. కాగా బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు జిల్లా వ్యాప్తంగా కొనసాగాయి. వలిగొండ, రామన్నపేట, మోత్కూరు, సంస్థాన్ నారాయణపురం, అడ్డగూడూరు, ఆలేరు, గుండాల, బొమ్మలరామారం మండలాల్లో పలువురు నాయకులను అరెస్ట్ చేసి, వ్యక్తిగత పూచీపై విడుదల చేశారు.



నారాయణపురంలో పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసిన బీఆర్ఎస్ నాయకులు

అఫిడవిట్లు స్వీకరించి విద్యుత్ మీటర్లు ఇవ్వాలి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 13: ఇళ్ల నిర్మాణం చేసుకున్న అర్హులైన నిరుపేదలకు అఫిడవిట్లు స్వీకరించి విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని హ్యూమన్ రైట్స్ యాంటికరప్షన్ యాంటి క్రైం బ్యూరో ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి చంద్రశేఖర్ కోరారు. జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకుని, విద్యుత్ సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు మీటర్లు ఇవ్వాలన్నారు.

విద్యార్థులు జీవించి పోరాడాలి

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 13: విద్యార్థులు పరీక్షలలో ఫెయిల్ అయ్యామనో..ఏ ఇతర కారణాలతోనే ఆత్మహత్యలు చేసుకుంటే సమస్యలు పరిష్కారం కావని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్ యశోద అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూప్రాన్‌పేట బాలికల గురుకుల కళాశాలలో ఆత్మహత్యల నివారణ వారోత్సవం నిర్వహించారు. డీఐఓ రామకృష్ణ, డాక్టర్ సుమన్‌కళ్యాణ్, డాక్టర్ సంపత్, డాక్టర్ స్వప్న ఉన్నారు.

పశువుల డీసీఎం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 13: పశువులను అక్రమంగా తరలిస్తున్న డీసీఎంను చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం నుంచి హైదరాబాద్ బహదూర్‌పూర స్లాటర్ హౌస్‌కు డీసీఎంలో 23 ఆవులు, ఎద్దులను తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ ఆవులను జియాగూడ గోశాలకు తరలించారు. డ్రైవర్ ఆఖిల్, సిగడ రమణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గణనాథుడి మండపం వద్ద లడ్డు చోరీ..

భువనగిరి రూరల్, సెప్టెంబరు 13: గుర్తు తెలియని వ్యక్తులు గణనాథుడి లడ్డును అపహరించుకుపోయే ప్రయత్నంలో భాగంగా విగ్రహం చెయ్యి భాగం ధ్వంసమైంది. ఈ ఘటన భువనగిరి మునిసిపల్ పరిధిలోని రాయిగిరిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గురువారం రాత్రి నిర్వాహకులు మండపం వద్ద నిద్రించకపోవడంతో గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు గణపతి చేతిలోని లడ్డును అపహరించుకునే ప్రయత్నం చేస్తుండగా గణేశుడి చెయ్యి భాగంలో పెట్టిన లడ్డు ఎంతకు రాకపోవడంతో బలవంతంగా తీస్తుండగా చెయ్యి భాగం విరిపోయింది. ఈ విషయమై భువనగిరి రూరల్ ఎస్ఐ వి సంతోష్‌కుమార్‌ను సంప్రదించగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

'పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి'

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 13: భూగర్భ జలాలను కలుషితం చేస్తున్న చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామపరిధిలో గల శివ పాలిమర్స్ ప్లాస్టిక్ పైపుల పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ముప్పిడి సైదులు గౌడ్, రైతు తగరం నాగరాజు శుక్రవారం నల్లగొండలో పీసీబీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. పరిశ్రమ వదులుతున్న కాలుష్యంతో భూగర్భజలాలు కలుషితమై పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, పశువులు నీళ్ల తాగడం లేదని తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంజీయూ రిజిస్ట్రార్ డాక్టర్ రవి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 13: ఉత్తమ విద్యాబోధన, ప్రమాణాలతో విద్యార్థుల భవిష్యత్తుకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ భరోసాగా ఉంటుందని రిజిస్ట్రార్ డాక్టర్ అల్వాల రవి అన్నారు. భువనగిరిలోని జాగృతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డేలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తు, ఉపాధి, ఉద్యోగ, అవకాశాలు లక్ష్యంగా పలు నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. పరీక్షా ఫలితాలు, యూనివర్సిటీ కార్యకలాపాల్లో జాగృతి విద్యార్థులు చూపుతున్న ప్రతిభ అద్భుతంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సూర్యనారాయణరెడ్డి, కరస్పాండెంట్ ఎస్‌బి మల్లేశం, చైర్మన్ బాలకృష్ణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఏ మణిపాల్ రెడ్డి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మోటకొండూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తూ అసువులు బాసిన అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు కాటెపల్లి, ముత్తిరెడ్డిగూడెం, వర్టూరు, మాటూరు. పెద్దబావి గ్రామాల్లోని అమరవీరుల స్తూపాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గాదగాని మాణిక్యం, ముసుగు పెంటారెడ్డి, బాలరాజు, నర్సింహ, శ్రీనివాస్, రాదమ్మ, అశోక్, పాండు పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్ : గ్రామపంచాయతీ ఎన్నికల ఓటర్ల ముసాయిదా జాబితాను గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శిలు విడుదల చేశారు. వార్డుల వారీగా రూపొందించిన జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయలలో, మండల పరిషత్ కార్యాలయంలో పబ్లిష్ చేశారు. ఓటర్ల జాబితలో తప్పులు ఉంటే గ్రామపంచాయతీ కార్యదర్శిలకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆలేరు రూరల్: పీఆర్‌టీయూ టీఎస్ ఆలేరు మండల అధ్యక్షుడిగా గడసంతం మధుసూదన్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఆలేరులో జరిగిన ఆ సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నారెడ్డి దశమంత రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా మాదాని జోసఫ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా కే ఉషారాణి, వీ.రాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆలేరు రూరల్: గ్రామీణ ప్రాంత కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శారాజీపేటకు చెందిన మహిళా కోలాట కళాకారులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎలేంద్ర, అండాలు, శ్రావణి, కవిత, ఉమ, రేణు, ఉపేంద్ర, పాతమ్మ తదితరులున్నారు.

మోత్కూరు : మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీ (8వ వార్డు)లో టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించనున్న మురుగు కాల్వ నిర్మాణ పనులను శుక్రవారం మునిసిపల్ చైర్ పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల కరపత్రాలను శుక్రవారం గౌడ సంఘం నాయకులు ఆవిష్కరించారు. నవంబర్ 15,16,17తేదీలలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కంఠమహేశ్వర స్వామి దేవాలయ అధ్యక్షుడు రావర్తి కరుణాకర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు బద్దం యాదయ్యగౌడ్, గీత పనివారల సంఘం అధ్యక్షుడు నీళ్ల గాలయ్య, నాయకులు, మొగుదాల సత్తయ్య, పాలకూర్ల యాదయ్య , పాలకూర్ల సతీష్, పందుల యాదగిరి, నీళ్ల రాజు పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో వృత్తి శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన కోసం వృత్తి శిక్షణ సంస్థలను (ట్రైనింగ్ పార్ట్‌నర్)లుగా నియమించేందుకు వృత్తి శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పి. యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను హైదరాబాద్‌లోని టీజీఎంఎఫ్‌సీ కార్యాలయంలో అక్టోబర్ 4 సాయంత్రం 5గంటల వరకు అందజేయాలని కోరారు. మరిన్ని వివారల కోసం 9505640004 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

భూదాన్‌పోచంపల్లి: ప్రముఖ వ్యాపారవేత్త మాడ్గుల యాదిరెడ్డి విగ్రహాన్ని మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ మాజీ మంత్రి రామసుబ్బారెడ్డితోపాటుమాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు మన్నె పద్మారెడ్డి, గట్టు రాంరెడ్డి, పాటి సుధాకర్‌రెడ్డి, చిల్లర జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని మున్సిపల్ కౌన్సిలర్ కొంగరి కృష్ణ అన్నారు. పట్టణ పరిధిలోని ముక్తాపూర్‌లో ఫ్రైడే పురస్కరించుకుని డ్రైడే కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు.

భువనగిరి టౌన్: భువనగిరి ఖిల్లా దిగువ భాగంలో ఉన్న పురాణ ఆలయాన్ని తొలగించి సంబంధిత శాఖల అనుమతులతోనే ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు కమిటీ సభ్యులు పురావస్తు శాఖ సహాయ సంచాలకులు నాగలక్ష్మి వివరించారు. ఈ మేరకు అలయ పనుల పరిశీలనకు వచ్చిన ఆమెకు ఆలయ పురాణ నేపథ్యం, విశిష్టతను వివరించారు. అలాగే ఆలయం వెలుపల భారీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఈపాటికే లిఖితపూర్వక సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

రామన్నపేట: నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు అందించాలని, ఇది పిల్లలకు ఎంతో మేలు చేస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి వి వెంకట రమణ అన్నారు. మండలంలోని కొమ్మాయిగూడెంలో శుక్రవారం పోషక ఆహారం పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యతపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బాలామృతంతో తయారు చేసిన లడ్డూలను పిల్లలకు పంపిణీ చేశారు. హేమలత, బాలమణి, అశోక్, మంజుల పాల్గొన్నారు.